10 YEAR ANNIVERSARY 2014 - 2024

# పెన్ పవర్

తెలంగాణ రౌండప్

బుధవారం 29 జనవరి 2025 పేజీలు 8



# ఇంగ్లీషు సులభంగా... అర్ధమయ్యేలా బోధించండి

## మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్..

- మేడ్చల్ శ్రీరంగవరం జిల్లా పరిషత్ హైస్కూల్‌ను ఆకస్మికంగా సందర్శించిన కలెక్టర్ గౌతమ్..
- డిజిటల్ క్లాసులకి హాజరయ్యే విద్యార్థులకు.. ఇంగ్లీషు సులువుగా అర్ధమయ్యేలా ఉండాలి..
- పాఠశాలలోని కంప్యూటర్ ల్యాబ్, లైబ్రరీ, వంటగది, డైనింగ్ హాల్‌ను కలెక్టర్ పరిశీలించారు..
- ఇంగ్లీషు పాఠాన్ని తెలుగులో వివరించిన విద్యార్థులకు కలెక్టర్ ప్రోత్సాహక బహుమతి..
- ప్రక్కనే ఉన్న అంగన్వాడీని సందర్శించి చిన్నారుల హాజరు పట్టికను కలెక్టరు పరిశీలించారు..
- ఏవిధంగా చిన్నారులను చదివిస్తున్నారని, పిల్లలకి అందించే భోజనం మెనూ అడిగి తెలుసుకున్నారు..
- అక్కడే ఉన్న వెటర్నరీ ఆసుపత్రిని కలెక్టర్ పరిశీలించి వెటర్నరీ డాక్టర్‌తో మాట్లాడారు..
- అక్కడి నుండి నూతన్‌కల్ లోని పల్లె దవఖానాను కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు..
- పల్లె దవఖానా పేద ప్రజలకు ఉపయోగపడేలా ఔట్ పేషంట్స్ శాతాన్ని పెంచాలని కలెక్టర్ ఆదేశించారు..






**మేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్, జనవరి 28:** డిజిటల్ క్లాసులకు హాజరయ్యే విద్యార్థులకు ఇంగ్లీషు సులువుగా అర్దమయ్యే విధంగా ఉండాలని హెడ్ మాస్టర్‌కు మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్ సూచించారు.. పదవ తరగతి విద్యార్థులు బాగా చదువుకొని వందశాతం ఉత్తీర్ణత సాధించాలని విద్యార్దులకు మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతం హితవు పలికారు.. మంగళవారం మేడ్చల్ మండలం శ్రీరంగవరం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను జిల్లా కలెక్టర్ గౌతమ్ ఆకస్మికంగా సందర్శించారు.. ఈ సందర్భంగా డిజిటల్ తరగతులను కలెక్టర్ పరిశీలించారు.. అందులో ఇంగ్లీషు విద్యార్థులకు సులువుగా అర్థమయ్యే విధంగా ఉండేలా చర్యలు చేపట్టాలని, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు

-2లో

# గాజులరామారంలో.. రెవెన్యూ కూల్చివేతలు..

## ఎనిమిది అక్రమ నిర్మాణాలు కూల్చివేసిన అధికారులు..




- కుత్బుల్లాపూర్ గాజులరామారం సర్వే నెంబర్ 329 ప్రభుత్వ భూమిలో 8 గదులు కూల్చివేత..
- తహశీల్దార్ రెహమాన్ ఆదేశాలతో ఆర్ఐ ఖలీమ్ ఆధ్వర్యంలో పోలీస్ భద్రతతో చర్యలు..
- ఎమ్మార్వో కార్యాలయానికి కూత వేటు దూరంలో అక్రమ నిర్మాణాలు..
- సర్వే నెంబర్ 307 ఎస్ఎఫ్‌సి,342, 329 ప్రభుత్వ భూముల్లో నిరంతర ప్రక్రియగా కబ్జాలు..

-3లో

# మహాపూజకు సర్వం సిద్ధం..
# నాగోబా జాతరలో కీలక ఘట్టం



**ఆదిలాబాద్ పెన్ పవర్:** ఇంద్రవెల్లి మండలం కెస్లాపూర్ లో నాగోబా జాతరలో కీలక ఘట్టం ఆవిష్కృతం కానుంది. ఇవాళ రాత్రికి జాతరలో కీలకమైన మహాపూజలు నిర్వహించేందుకు మెస్రం వంశీయులు సిద్ధమయ్యారు. గంగా జలాన్ని, ఆలయ ప్రాంగణంలోని మురాడి వద్దకు మెస్రం వంశీయులు తీసుకొచ్చారు. గ్రామంలోని పాత ఆలయం నుంచి నాగోబా విగ్రహాన్ని ఊరేగింపుగా గర్భగుడిలో ప్రతిష్టించారు. అనంతరం ఆలయ సమీపంలోని కోనేరు నుంచి మట్టి కుండల్లో నీటిని తీసుకువచ్చి పుట్టలు తయారు చేయనున్నారు.అర్ధరాత్రి 11:30 సమయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం జాతర ప్రారంభం కానుంది. పూజా కార్యక్రమంలో జిల్లా అధికారులతో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు మెస్రం వంశీయులు పాల్గొంటారు. ఐదు రోజులపాటు జరిగే ఈ జాతరకు తెలుగు రాష్ట్రాలతోపాటు మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాల నుంచి లక్షలాది మంది భక్తులు హాజరవుతారు.

# ఇంగ్లీషు సులభంగా.. అర్థమయ్యేలా బోధించండి..





## అంగన్‌వాడీ- వెటర్నరీ, పల్లె దవాఖానను కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు..

అనంతరం ప్రక్కనే ఉన్న అంగన్వాడీని సందర్శించిన కలెక్టర్, ఎంత మంది చిన్నారులు ఉన్నారని, వారి హాజరు పట్టికని పరిశీలించారు.. చిన్నారులను ఏవిధంగా చదివిస్తున్నారని, వారికి అందించే భోజనం గురించి అడిగి తెలుసుకున్నారు.. వెంటనే అక్కడే ఉన్న వెటర్నరీ ఆసుపత్రిని సందర్శించిన కలెక్టర్ వెటర్నరీ డాక్టరును వివరాలు అడిగి తెలుసుకున్నారు.. అక్కడి నుండి నూతన్‌కల్ లోని పల్లె దవఖానాను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు.. పల్లె దవఖానాను పేద ప్రజలకు ఉపయోగపడేలా ఔట్ పేషంట్స్ శాతాన్ని పెంచాలని కలెక్టర్ గౌతమ్ ఆదేశించారు. పల్లె దవఖానాను పేద ప్రజలకు ఉపయోగపడేలా ప్రచారం చేసి, ఔట్ పేషంట్ శాతాన్ని మరింత పెంచాలని డాక్టర్‌కు సూచించారు. ప్రతిరోజు ఔట్ పేషంట్స్ ఎంత మంది వస్తున్నారు..? గ్రామంలో జనాభా ఎంత..? అని డాక్టర్, ఎఎన్ఎంలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు.. రోజుకు సుమారుగా 35 మంది ఔట్ పేషంట్స్ వస్తారని డాక్టర్ తెలుపగా, ఓపిని పెంచేందుకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. దవఖానాలోని రిజిష్టర్లను కలెక్టర్ పరిశీలించి తగు సూచనలు చేశారు.. ఈ కార్యక్రమంలో డిఈఓ విజయలక్ష్మి, డిఎంహెచ్ఓ డాక్టర్ టి.రఘునాథ స్వామి, జిల్లా సంక్షేమాధికారి స్వర్ణలత, ఎంఆర్ఓ శైలజ, ఎంపిడిఓ వసంత లక్ష్మి, జెడ్ పి సిఈఓ కాంతమ్మ, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు కలెక్టర్ ప్రోత్సాహక బహుమతులు..

లైబ్రరీలో చదువుతున్న విద్యార్థుల్లో కొంత మంది చదువుతున్న ఇంగ్లీషు పాఠాన్ని తెలుగులో చెప్పమని కలెక్టర్ గౌతమ్ సూచించగా..!ఆ పాఠాన్ని విద్యార్థులు చదివి అర్థవంతంగా వివరించడాన్ని కలెక్టర్ సంతోషం వ్యక్తం చేశారు.. విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులను కలెక్టర్ పెన్నులను బహుకరించారు.. విద్యార్థులు సమయాన్ని వృధా చేయకుండా ఉన్నత శిఖరాలను అధిరోహించేందుకు కృషి చేయాలని సూచించారు.. పాఠశాలలో ఏమైనా వసతుల కల్పనకు హెడ్ మాస్టర్‌ను సంప్రదించి సమస్యలను దృష్టికి తీసుకురావాలని విద్యార్థులకు బోధించారు..



- మొదటి పేజి తరువాయి

రాజశేఖర్‌కు సూచించారు.. అనంతరం పిల్లలతో ముచ్చటిస్తూ సిలబస్ పూర్తయిందా లేదా..! ఎలా చదువుతున్నారని విద్యార్థులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు.. సిలబస్ లోని ఒక గణిత సమస్యను విద్యార్థులకు ఇచ్చారు.. విద్యార్థులు గణిత సమస్యను చేసి కలెక్టర్‌కి చూపించడంతో. కలెక్టర్ అభినందించారు.. పాఠశాలలోని కంప్యూటర్ ల్యాబ్, లైబ్రరీ, వంటగది, డైనింగ్ హాల్‌ను పరిశీలించారు.. అవసరమైన సలహాలను సూచనలను హెడ్ మాస్టర్‌కు కలెక్టర్ సూచనలు చేశారు.. పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు స్నాక్స్ అందించాలని ఆదేశించారు. ల్యాబ్ లోని పరికరాలను పరిశీలించి, వినియోగంలో లేని వాటిని రిప్లేస్ చేయించాలని సూచించారు..







- కుత్బుల్లాపూర్ గాజులరామారం సర్వే నెంబర్ 329 ప్రభుత్వ భూమిలో 8 గదులు కూల్చివేత..
- తహశీల్దార్ రెహమాన్ ఆదేశాలతో ఆర్ఐ ఖలీమ్ ఆధ్వర్యంలో పోలీస్ భద్రతతో చర్యలు..
- ఎమ్మార్వో కార్యాలయానికి కూత వేటు దూరంలో అక్రమ నిర్మాణాలు..
- సర్వే నెంబర్ 307 ఎస్ఎఫ్సి,342, 329 ప్రభుత్వ భూముల్లో నిరంతర ప్రక్రియగా కబ్జాలు..

గాజులరామారం సర్వే నెం.329 ప్రభుత్వ భూమిలో కూల్చివేతలు..




# గాజులరామారంలో...
# రెవెన్యూ కూల్చివేతలు

## ఎనిమిది అక్రమ నిర్మాణాలు కూల్చివేసిన అధికారులు..

ప్రభుత్వ భూములతో బికారీలను కోటీశ్వరులను చేసిన ఏకైక మండలం కుత్బుల్లాపూర్, గాజులరామారం గ్రామంలోని ప్రభుత్వ భూములు అంతరించి పోతున్నాయి..అక్రమార్కులకి అండగా వివిధ రాజకీయ పార్టీల నేతల సిఫార్సులు.. స్థానిక అధికారులు మొదలుకుని ఉన్నతాధికారుల వరకు భారీగా ముడుపులు ముట్టజెప్పే కబ్జాదారులు.. సుమారు 3-5 ఏళ్ళ కాలంలో వేలకోట్లు విలువైన ప్రభుత్వ భూములను కబ్జాదారులకి కట్టబెట్టేందుకు రెవెన్యూ అధికారులు తీవ్ర కృషిచేశారనే చెప్పాలి.. సర్వే నెం.329, 342, 307 ప్రభుత్వ భూములు కేవలం రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యమో..! కబ్జాదారులతో చేతులు కలిపి ఒప్పందమో..! తెలియదు కానీ ఒక్కో అక్రమ కట్టడానికి, భేరం కుదుర్చుకుని, ఒప్పంద నిర్మాణాలు చేపట్టిన సందర్భాలు ఉన్నాయి.. గతంలో పత్రికల్లో వచ్చిన వార్తా కథనాలకు పలుమార్లు కూల్చివేతలు చేపట్టిన అధికారులు నలుగురు రెవెన్యూ అధికారులను సస్పెండ్ చేసింది తెలిసిందే.. కుక్కతోకకు గుండ్రాయి కట్టినా వంకర వంకరే అన్న సామెతకు అద్దంపడుతూ అధికారుల నైజంలో మార్పు లేకపోవడం బాధాకరం.. తాము భూములపై సర్వ అధికారాలు కలిగిన తిరుగులేని అధికారులమనే ఉద్దేశంతో..! కబ్జాదారులకు బహిరంగంగానే సహకరించడం, మరీ అవసరమైతే మొక్కుబడి చర్యలతో మమా అనిపించడం పరిపాటిగా మారింది.. పాలకులు సరిగ్గా లేకపోతే అధికారులతో చక్కబెట్టుకోచ్చు, అధికారులు కూడా పాలకుల సిఫార్సులతో వారి అడుగుజాడల్లో పయనిస్తూ, కరెప్షన్‌కి బ్రాండ్ అంబాసిడర్‌లుగా మారితే చేసేది ఏముంది.. హాస్యాస్పదం ఏంటంటే కుత్బుల్లాపూర్ తహశీల్దార్ కార్యాలయానికి సమీపంలోనే ఈ కూల్చివేతలు పలువురిని విస్మయానికి గురిచేస్తుంది.. రెవెన్యూ వ్యవస్థ ఉన్నట్టా లేనట్టా అంటూ విమర్శలు వస్తున్నాయి.. నిర్మాణాలు చేపట్టేవరకు అధికారులు విధుల్లో లేరా..? అంటూ ఎద్దేవా చేస్తున్నారు..

**మేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్, జనవరి 28:**



భూ కబ్జాదారులకి విద్యుత్ అధికారుల ప్రోత్సాహం.. విద్యుత్ మీటర్లు..



కూల్చివేతల్లో పాల్గొన్న పోలీసులు



భూ కబ్జాదారులకు సహకరించడంలో విద్యుత్ అధికారులు ప్రధాన పాత్ర పోషిస్తున్నారు..జీహెచ్ఎంసి పరిధిలో అక్రమ నిర్మాణాలకు ట్రాన్స్‌ఫార్మర్‌లు..! ప్రభుత్వ భూముల్లో అక్రమ కట్టడాలకు అధిక మొత్తంలో లంచాలు పుచ్చుకుని యధేచ్చగా మీటర్లు ఇస్తున్న విద్యుత్ శాఖ అధికారులని సస్పెండ్ చేస్తే కబ్జాలకు కొంత బ్రేక్ పడుతుంది.. మరోవైపు కబ్జాదారులకు రెవెన్యూ అధికారుల సహకారంపై కలెక్టర్ దృష్టి సారించి చర్యలు తీసుకోకపోతే ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం అయ్యే అవకాశం ఉంది..

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కుత్బుల్లాపూర్ మండలం గాజులరామారం సర్వే నెంబర్ 329 ప్రభుత్వ భూమిలో రెవెన్యూ అధికారులు కూల్చివేతలు చేపట్టారు.. తహశీల్దార్ కార్యాలయానికి కూతవేటు దూరంలోనే ఈ కూల్చివేతలు చేపట్టడం రెవెన్యూ అధికారుల వైఫల్యానికి నిదర్శనం.. గాజులరామారంహౌసర్వే నెంబర్ 329 ప్రభుత్వ భూమిలో వెలిసిన 8 అక్రమ కట్టడాలను, కుత్బుల్లాపూర్ తహశీల్దార్ రెహమాన్ ఆదేశాలతో, ఆర్ఐ ఖలీమ్ ఆధ్వర్యంలో పోలీస్ భద్రతతో రెవెన్యూ సిబ్బంది జేసిబిలతో 8 అక్రమ కట్టడాలను కూల్చివేశారు.. అయితే కుత్బుల్లాపూర్ మండలంలో ఓ ప్రత్యేకత ఉందని చెప్పాలి.. గత మూడేళ్ళుగా అక్రమ నిర్మాణాల సంఖ్యకు, కూల్చివేతల సంఖ్యకు పొంతన ఉండదు.. నిర్మాణాలు 10 ఉంటే కూల్చివేతలు 2-3 మాత్రమే ఉండేవి.. గతంలో సస్పెండ్ అయిన ఓ ఆర్ఐ అధికారులు ఎలా సంపాదించాలో దిశానిర్దేశం చేసిన ఘనుడిగా పేరుంది.. ఈ వ్యవహారం ఒకరి నుండి ఒకరికి ఇలా "గజ్జి తామర" కంటే వేగంగా అధికారులకి పాకింది.. ఇప్పటికీ సర్వే నెంబర్ 328 పట్టా భూమి పేరుతో 329 ప్రభుత్వ భూమి, పక్కనే ఉన్న "వీణస్‌రాక్ హైట్స్" వెంచర్‌లో 3-5 ఎకరాలు కబ్జాలో ఉన్నట్లు అంచనా.. అయినా రెవెన్యూ అధికారులు బాధ్యతా లేకుండా వ్యవహరిస్తున్నారని సర్వత్రా విమర్శలు వస్తున్నాయి.. చివరికి రెవెన్యూ కార్యాలయాలు, అధికారులు పేరుకే అన్నట్టు తయారైందని పలువురు ఆరోపిస్తున్నారు.. మంగళవారం కూల్చివేసిన అక్రమ నిర్మాణాలు గతంలో కూల్చిన చోటనే నిర్మించినవే మళ్ళీ ఇప్పుడు కూల్చివేశారని, నిర్మాణాలు చేపడుతుంటే అధికారులు విధుల్లో లేరా అంటూ ప్రశ్నిస్తున్నారు..



## మున్సిపల్ ఏకపక్ష నిర్ణయాలపై..! మాజీ కౌన్సిలర్ విమర్శలు..

- వారం క్రితం అత్యవసర సమావేశంలో తీసుకున్న 25 అంశాలపై జయశ్రీ అభ్యంతరం..
- జగిత్యాల మున్సిపాలిటీలో నిధుల దుర్వినియోగంపై ఆమె తీవ్రంగా స్పందించారు..



**జగిత్యాల జిల్లా,పెన్ పవర్, జనవరి 28:** జగిత్యాల మున్సిపాలిటి ద్వారా ఇటీవల తీసుకున్న కొన్ని నిర్ణయాలపై మాజీ కౌన్సిలర్ హనుమండ్ల జయశ్రీ అభ్యంతరాలు వ్యక్తం చేశారు. 24-01-2025 నాటి అత్యవసర సమావేశంలో తీసుకున్న 25 అంశాలను పరిగణలోకి తీసుకుని, ఆమె కొన్ని కీలక అంశాలపై విమర్శలు చేశారు.ప్రధానంగా, మోతె స్మశాన వాటికలో 50 లక్షల రూపాయలు ఖర్చుతో ఎలక్ట్రికల్ క్రిమాటోరియం స్థాపించడం, చైర్పర్సన్ మరియు కమీషనర్ వాహనాల కొనుగోలు, అలాగే కొత్త కంప్యూటర్లు, యుపిఎస్ లు, ప్రింటర్ల కొనుగోలు అంశాలపై ఆమె తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేశారు. ఈ నిర్ణయాలు సమాజ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని తిరిగి సమీక్షించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.ఈ అంశాలపై పూర్తి స్థాయి విచారణ జరిపి, ప్రజాధనాన్ని సక్రమంగా వినియోగించాల్సిన అవసరం ఉందని ఆమె డిమాండ్ చేశారు..

## పట్టణ ప్రాంతాల అభివృద్ధికి మునిసిపల్ కమిషనర్లు పనిచేయాలి

**హైదరాబాద్ పెన్ పవర్:**మున్సిపల్ కమిషనర్ల సంఘం డైరీ 2025 ను మంత్రి నారాయణ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి సంఘం అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు నాగ నరసింహారావు,బాలస్వామి,ఇతర నాయకులు హాజరయ్యారు.
మంత్రి మాట్లాడుతూ పట్టణ ప్రాంతాల అభివృద్ధికి మున్సిపల్ కమిషనర్లు కష్టపడి పనిచేయాల్సిన అవసరం ఉంది. మున్సిపాలిటీల్లో ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుంది. భవనాలు, లే అవుట్ల అనుమతులను మున్సిపాలిటీలకు అప్పగించాం. ప్రజలకు పారదర్శకంగా సేవలు అందించేలా అధికారులు పనిచేయాలని అన్నారు.
మున్సిపాలిటీలకు టౌన్ ప్లానింగ్ అనుమతులను ఇవ్వడంపై సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేసారు. ప్రభుత్వ నిర్ణయాల ప్రకారం ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

## ప్రతి జిల్లాలో సైబర్ క్రైమ్ పోలీసుస్టేషన్

**హైదరాబాద్ పెన్ పవర్:**ఏపీ రాష్ట్రంలో సైబర్ క్రైమ్ అనేది పెరిగిందని ఇతర నేరాలు తగ్గి ఈ కేసులు పెరుగుతున్నాయని డీజీపీ ద్వారకా తిరుమలరావు అన్నారు. శ్రీకాకుళంలో మాట్లాడుతూ.. "సైబర్ క్రైమ్ అనేది దేశవ్యాప్తంగా ఆందోళన కలిగిస్తున్న అంశం. దీనిని ఎలా అదుపు చేయాలని ఆలోచిస్తున్నాం. ప్రతి జిల్లాలో సైబర్ క్రైమ్ పోలీసుస్టేషన్ పెట్టాలని యోచిస్తున్నాం.నిపుణులను ఉపయోగించు కోవడం ప్రజల్లో అవగాహన కల్పించడం ముఖ్యమని పేర్కొన్నారు.

# స్టాంప్ పేపర్‌ల కొరతతో.. ప్రజలు ఇబ్బందులు..

- ఫీజుమాఫీ డిక్లరేషన్‌కై రూ.20 స్టాంప్ పేపర్‌లు దొరక్క పోవడంతో విద్యార్థుల అవస్థలు..
- వైట్ పేపర్‌పై ఫ్రాంకింగ్ స్టాంపులను "మీ సేవా" "కళాశాలలు" స్వీకరించాలి:రవీందర్ ముదిరాజ్..
- ఎస్ఆర్ఓ కార్యాలయాల్లోనూ స్టాక్ లేక ఆఫీసుల చుట్టూ విద్యార్థుల ప్రదక్షిణలు..



కోలా రవీందర్ ముదిరాజ్.. సామాజిక కార్యకర్త..

**కుత్బుల్లాపూర్, పెన్ పవర్, జనవరి 28:** విద్యార్థులు ఫీజు మాఫీ కోసం రూ.20 స్టాంప్ పేపర్‌పై డిక్లరేషన్ ఇవ్వాలని ఉత్తర్వులు జారీచేస్తున్న ప్రభుత్వం సంబంధిత 20 రూపాయల స్టాంపు పత్రాలు అందుబాటులో ఉండకపోవడంతో ప్రతియేటా సమస్యగా మారిందని, సామాజిక వేత్త, పర్యావరణ ప్రేమికుడు కోలా రవీందర్ ముదిరాజ్ ఆవేదన వ్యక్తం చేశారు.. కనీసం ఎస్ఆర్ఓ ఆఫీసులో అయినా విద్యార్థుల కోసం అందుబాటులో ఉంచాలని అధికారులను ప్రాదేయపడ్డారు..స్టాంపు పేపర్‌లు స్టాక్ లేక విద్యార్థులు కార్యాలయ చుట్టూ సమయాన్ని వృధా చేసుకుంటూ ప్రదక్షిణలు చేస్తున్నారని, ఈ విషయాన్ని సంబంధిత అధికారులు పట్టించుకోవాలని కోరారు..విద్యార్థులు తిరుగని ఆఫీస్ లేదని, జిల్లా రిజిస్టార్ ఈ చిన్న సమస్యపై దృష్టి సారించి సమస్య పరిష్కరించాలని రవీందర్ ముదిరాజ్ విజ్ఞప్తి చేశారు.. జిల్లాలోని అన్ని రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో త్వరితగతిన అందుబాటులో ఉంచాలని అన్నారు..

### ఫ్రాంకింగ్ స్టాంపులు అనుమతించాలి: రవీందర్ ముదిరాజ్..

రూ.20 స్టాంపు పత్రాల స్టాకును అన్ని రిజిస్టర్ కార్యాలయాలు అందించాలని రవీందర్ ముదిరాజ్ కోరారు.. కొన్ని మీ సేవా కేంద్రాలు.. కళాశాలలు..! రూ.100 స్టాంపు పేపర్‌పై డిక్లరేషన్ ఇస్తే చెల్లవని విద్యార్థులను ఇబ్బంది పెడుతున్నారని ఆయన ఆరోపించారు.. ప్రజల ఇబ్బందులను గుర్తించి త్వరగా స్టాకును అందిస్తారని రూ.20 స్టాంప్ పేపర్ దొరకని యెడల రూ.50 పైనగాని రూ.100 పైన గాని ఆమోదించాలని.. లేని పక్షాన తెల్ల కాగితంపై ఫ్రాంకింగ్ రూ.20 స్టాంపింగ్ చేయించిన వాటిని, "మీ సేవ కేంద్రాలు- కళాశాలలు స్వీకరించాలని సంబంధిత విద్యాశాఖను రవీందర్ ముదిరాజ్ విజ్ఞప్తి చేశారు.. కాలేజీలకు జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు ఇవ్వాలని విద్యార్థుల తరపున సామాజిక కార్యకర్త కోలా రవీందర్ ముదిరాజ్ ప్రభుత్వాన్ని కోరారు.

# రైల్వేలు, బ్రిడ్జిల సమస్యలపై.. రైల్వే అధికారులతో ఈటెల భేటీ..





**సికింద్రాబాద్, పెన్ పవర్, జనవరి 28:** మల్కాజిగిరి పార్లమెంటు నియోజకవర్గంలోనే అత్యధిక రైల్వేస్టేషన్లు, రైల్వే లైన్లు, అండర్ బ్రిడ్జీలు, ఫ్లై ఓవర్ బ్రిడ్జిలు ఉండడతో రైల్వే పనులపై ఎంపి ఈటెల రాజేందర్ ప్రత్యేక దృష్టి సారించారు.. ఇప్పటికే పలుమార్లు రైల్వే అధికారులతో సమావేశం అయ్యారు.. రైల్వే, జిహెచ్ఎంసి అధికారులు సంయుక్తంగా సమావేశం ఏర్పాటు చేశారు..
రైల్ నిలయంలో జరిగిన ఈ సమావేశంలో ఇరు విభాగాల మధ్య పెండింగ్‌లో ఉన్న పనులను సమీక్షించారు.. త్వరిత గతిన పూర్తిచేయడానికి కలిసి పనిచేయాలని సూచించారు.. ప్రతి నెలా సమన్వయ సమావేశం ఏర్పాటు చేసుకొని పనులు పూర్తి చేస్తామని రైల్వే, జిహెచ్ఎంసి అధికారులు ఎంపీ ఈటల రాజేందర్‌కు తెలియ పరిచారు.. కార్యక్రమంలో
జిహెచ్ఎంసి కమీషనర్ ఇలాంబర్తి, డీజీమ్ ఉదయనాథ్, డిఆర్ఎం లోకేష్, వైష్ణవ, సిఈ పబ్లిక్ హెల్త్ భాస్కర్ రెడ్డి, సిఈ శ్రీనివాస్ పాల్గొన్నారు..

# కొమురవెల్లి మల్లన్న గుడిలో అఘోరీ నాగసాధువు ఇలా చేసిందేంటి..?



**హైదరాబాద్ పెన్ పవర్:** సిద్దిపేట జిల్లా: కొమురవెల్లి మల్లన్న గుడిలో అఘోరీ నాగసాధువు నానా రచ్చ చేసింది. కత్తితో పలువురిపై దాడి చేస్తూ భక్తులను భయభ్రాంతులకు గురిచేసింది. ఆలయ ప్రధాన ద్వారం నుంచి స్వామివారి దర్శనానికి అనుమతి ఇవ్వాలని మొండిపట్టు పట్టింది. బట్టలు వేసుకొని దర్శనానికి రావాలని ఆలయ అధికారులు సూచించారు. భక్తులు ఆమె తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. దీంతో.. ఆమె భక్తులపై తన వెంట తెచ్చుకున్న ఖడ్గంతో దాడి చేసింది. ఈ దాడిలో పలువురికి గాయాలయ్యాయి. కొంతసేపటి తర్వాత పోలీసులు రంగ ప్రవేశం చేశారు. అప్పుడు అఘోరీ నాగసాధువు దుస్తులు ధరించి దర్శనానికి వెళ్లేందుకు ఒప్పుకుంది. ఆలయ అధికారులు, పోలీసులు స్వామివారి దర్శనం చేయించడంతో దర్శనం అనంతరం అఘోరీ అక్కడి నుంచి వెళ్లిపోయింది. సికింద్రాబాద్ కుమ్మరిగూడ ముత్యాలమ్మ తల్లి ఆలయంలో అమ్మవారి విగ్రహాన్ని ధ్వంసం చేసిన విషయం తెలిసి శాంతి హోమం, చండీ హోమం, పూర్ణాహుతి జరుగుతున్న సమయంలో అఘోరీ నాగసాధు అక్కడికి వెళ్లింది. భక్తులు అందరూ ఆశ్చర్యపోయారు. సాక్షాత్తు అమ్మవారే వచ్చిందని భక్తులు నమ్మారు. ఆలయానికి వెళ్లిన అఘోరీ హోమంలో పాల్గొని, ఒంటి కాలుపై నిలబడి పూజలు చేశారు. నాగ సాధు అఘోరీ గురించి తెలిసే ఉంటుంది. తెలుగు రాష్ట్రాల్లో నాగ సాధు అఘోరీ ఆలయాల సందర్శనకు పూనుకున్న సంగతి తెలిసిందే. ఆలయాలకు నాగ సాధు అఘోరీ వెళ్లడం, వస్త్రాలు లేకుండా అనుమతించేది లేదని ఆలయ సిబ్బంది తేల్చి చెప్పడం ఈ మధ్య చూస్తూనే ఉన్నాం. వరంగల్‌లోని భద్రకాళి ఆలయంలో కూడా అప్పట్లో ఇదే జరిగింది. వరంగల్ భద్రకాళి ఆలయానికి నాగ సాధు అఘోరీ వెళ్లింది. ఆలయం వద్ద అఘోరీని దేవాలయ సిబ్బంది అడ్డుకున్నారు. వస్త్రాలు లేకుండా అనుమతించేది లేదని ఆలయ సిబ్బంది తేల్చి చెప్పారు. అఘోరీని చీర కట్టుకొని లోపలికి రావాలని భక్తులు కూడా కోరారు. దీంతో.. భక్తుల కోరిక మేరకు చీర కట్టుకొని అమ్మవారి దర్శనానికి ఆలయంలోకి నాగ సాధు అఘోరీ వెళ్లింది.

# అమెజాన్ హైదరాబాద్ ఆఫీసులో 100 కోట్ల మోసం

**రవాణా చార్జీల పేరుతో 22 మంది ఉద్యోగులు, మాజీ ఉద్యోగుల టోకరా**

**సరుకుల డెలివరీకి వెళ్లకుండానే వెళ్లివచ్చినట్లు బిల్లులు**

**సైబర్ సెక్యూరిటీ బ్యూరోకు ఫిర్యాదు చేసిన అమెజాన్**




**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రముఖ ఈ- కామర్స్ సంస్థ అమెజాన్ ను ఆ సంస్థ ఉద్యోగులే మోసం చేశారు. వినియోగదారులకు సరుకులను అందించే క్రమంలో నకిలీ బిల్లులు సృష్టించి రూ.102 కోట్లను కాజేశారు. ప్యాకేజీపై పేర్కొన్న చిరునామాలో వినియోగదారుడు లేడని చెబుతూ రవాణా చార్జీలు క్లెయిమ్ చేసుకున్నారు. హైదరాబాద్ ఆఫీసు కేంద్రంగా జరిగిన ఈ మోసంలో సంస్థ సిబ్బందితో పాటు గతంలో పనిచేసి మానేసిన వారి ప్రమేయం కూడా ఉందని అమెజాన్ ప్రతినిధి జీఎస్ అర్జున్ కుమార్ ఆరోపించారు. అమెరికాలో సరుకులు సరఫరా చేసే వారితో కలిసి ఈ మోసానికి పాల్పడ్డారని వివరించారు. ఈమేరకు సైబర్ సెక్యూరిటీ బ్యూరోకు ఫిర్యాదు చేయగా.. అధికారులు మొత్తం 22 మందిపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

**కుట్ర చేశారిలా..**

హైదరాబాద్ లో అమెజాన్ రిలే ఆపరేషన్ సెంటర్ ఉంది. ప్రపంచంలో ఎక్కడ ఏ వస్తువును డెలివరీ చేస్తున్నదీ ఈ సెంటర్ నుంచే పర్యవేక్షిస్తారు. గోడౌన్ నుంచి బయటకు వెళ్లినప్పటి నుంచి ప్యాకేజీ కస్టమర్ కు చేరేవరకు సంస్థ సిబ్బంది కదలికలను జీపీఎస్ ఆధారంగా పర్యవేక్షిస్తుంటారు. ఈ డెలివరీ వ్యవహారాన్ని థర్డ్ పార్టీకి కాంట్రాక్ట్ ఇస్తారు. సంస్థ గోడౌన్ నుంచి కస్టమర్ చిరునామా వరకు దూరాన్ని బట్టి రవాణా ఖర్చును అమెజాన్ చెల్లిస్తుంది. ఒకవేళ కస్టమర్ ఆ సమయంలో ఆ చిరునామాలో లేకుంటే ప్యాకేజీ డెలివరీ చేయకపోయినా రవాణా ఖర్చు చెల్లించాల్సిందే. ఇందులో లొసుగును పసిగట్టిన మాజీ సిబ్బంది కొంతమంది మోసానికి తెరలేపారు. ప్రస్తుతం రిలే సెంటర్ లో పనిచేస్తున్న వారితో పాటు అమెరికాలోని సిబ్బందితో కలిసి నకిలీ ట్రిప్పులను నమోదు చేసి బిల్లులు దండుకున్నారు.

**ఇదీ మోసం..**

వస్తువును డెలివరీ చేయడానికి వెళ్లిన సమయంలో ఆ చిరునామాలో కస్టమర్ లేకపోతే ఆ విషయాన్ని అమెజాన్ సిబ్బంది సంస్థ యాప్ లో నమోదు చేయాలి. దీనిని రిలే సెంటర్ సిబ్బంది నిర్ధారిస్తారు. డెలివరీ కోసం ఎంత దూరం ప్రయాణించారనేది లెక్కగట్టి, దీనికి అయిన ఖర్చును డెలివరీ సంస్థలకు అమెజాన్ చెల్లిస్తుంది. అమెరికాలో వస్తువుల డెలివరీకి వెళ్లకుండానే వెళ్లినట్లు రికార్డు చేసి, చిరునామాలో కస్టమర్ లేడని చెబుతూ రవాణా ఖర్చులను వసూలు చేశారు. ఇలా రూ.102,88,05,418 కొల్లగొట్టారు.

# వరల్డ్ ఫేమస్ చెట్లతో ఎకో పార్క్ ఆకట్టుకుంటోంది : సినీ నటుడు చిరంజీవి




**హైదరాబాద్ పెన్ పవర్:** చిలుకూరు బాలాజీ టెంపుల్ సమీపంలో వరల్డ్ క్లాస్ ఎక్స్ పీరియం ఎకో పార్క్ ను మంగళవారం (జనవరి 28) ప్రారంభించారు సీఎం రేవంత్ రెడ్డి. రంగారెడ్డి జిల్లాలో శంకర్ పల్లి పరిధిలోని పొద్దుటూరులో ఉంది. 150 ఎకరాల విస్తీర్ణంలో ఎకో పార్క్ ప్రపంచ వ్యాప్తంగా ఉన్న 25వేల జాతుల మొక్కలను ఏర్పాటు చేశారు. ప్రారంభోత్సవానికి హాజరైన మంత్రి జూపల్లి కృష్ణారావు, సినీ నటుడు చిరంజీవి, ఎంపీ సీఎం రమేష్,వనజీవి రామయ్య దంపతులు లు పాల్గొన్నారు. ఎకో ఎక్స్ పీరియం పార్కు ప్రారంభోత్సవంలో నటులు చిరంజీవి మాట్లాడుతూ..పార్కును అద్భుతంగా తీర్చిదిద్దారు.. మంచి టూరిజం స్పాట్ అవుతుంది.. వెడ్డింగ్స్, ఈవెంట్స్ కి అద్భుతంగా ఉంటుందన్నారు. ఈ పార్కులో ఏర్పాటు చేసిన చెట్లు బాగా ఆకట్టుకున్నాయన్నారు. ముఖ్యంగా వివిధ దేశాలనుంచి తెప్పించిన అద్భుత కళాఖండాలతో ఈ పార్క్ ను తీర్చిదిద్దారు.

# హమ్మయ్యా.. ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో బాంబ్ లేదు: బాంబ్ స్క్వాడ్ తనిఖీలు కంప్లీట్




**హైదరాబాద్ పెన్ పవర్:** హైదరాబాద్ నాచారంలోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌కు బాంబ్ బెదిరింపు తీవ్ర కలకలం రేపిన విషయం తెలిసిందే. పాఠశాలలో బాంబ్ పెట్టినట్లు గుర్తు తెలియని దుండగులు మెయిల్ చేయడంతో వెంటనే అప్రమత్తమైన స్కూల్ యాజమాన్యం పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న బాంబ్ స్క్వాడ్ హుటాహుటిన డీపీఎస్‌కు చేరుకుని తనిఖీలు చేపట్టింది. విద్యార్థుల ప్రాణాలకు సంబంధించిన విషయంతో కావడంతో ఏ మాత్రం నిర్లక్ష్యం వహించకుండా బాంబ్ స్క్వాడ్ పోలీసులు పాఠశాలను అణువు అణువు జల్లెడ పట్టారు. దాదాపు రెండు మూడు గంటల విస్తృత తనిఖీల అనంతరం బాంబ్ స్క్వాడ్ తనిఖీలు ముగిశాయి. పేలుడు పదార్థాలకు సంబంధించిన ఎలాంటి ఆనవాళ్లు దొరకలేదని పోలీసులు నిర్ధారించారు. పాఠశాలలో ఎలాంటి పేలుడు పదార్థాలు లభ్యం కాకపోవడంతో విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు, పాఠశాల సిబ్బంది, పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు. బాంబ్ బెదిరింపు మెయిల్ వచ్చిన వెంటనే అప్రమత్తమైన స్కూల్ మేనేజ్మెంట్ ముందస్తుగానే విద్యార్థులకు సెలవు ఇచ్చి ఇంటికి పంపించింది. మరోవైపు డీపీఎస్ కు బాంబు బెదిరింపు ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. స్కూల్ కు బాంబు బెదిరింపు కాల్ ఎవరి నుండి వచ్చింది..? మెయిల్ ఎవరు పంపారు..? అన్న దానిపై పోలీసులు విచారణ మొదలుపెట్టారు.

## దొంగ కష్టపడ్డాడు.. ఫలితం దక్కలేదు

**హైదరాబాద్ పెన్ పవర్:** సాధారణంగా దొంగలు తాళం వేసి ఉన్న ఇళ్లను టార్గెట్ చేస్తారు. కొన్ని ఆయుధాలతో తాళం పగులకొట్టి.. ఇంట్లోకి చొరబడి అందినకాడికి దోచుకుంటారు. కాని ఒక్కోసారి తాళం తీసేటప్పుడు సౌండ్ రావడంతో ఇట్టే చిక్కుతారు. అందుకే దొంగలు చాలా జాగ్రత్తగా శబ్దం రాకుండా తాళం తీసి వాళ్ల పని వాళ్లు చేసుకొని వెళ్లిపోతారు. తాజాగా రంగారెడ్డి జిల్లాలో ఓ దొంగ తాళం వేసిన ఇంటికి దొంగతనానికి వచ్చాడు. అయితే తాళం తీయడంలో విఫలం కావడంతో ఈసురోమంటూ వెనుదిరిగాడు. ఈ సంఘటనకు సంబంధించి పూర్తి వివరాల్లోకి వెళ్తే.....

రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ మున్సిపాలిటీ చటాన్ పల్లి అంగన్ వాడీ టీచర్ పద్మ దత్తాత్రేయ గుడి దగ్గరలో ఓ ఇంట్లో నివసిస్తోంది. ఆమె భర్త విక్రమ్‌కు ఆరోగ్యం సరిగా లేకపోవడంతో ట్రీట్ మెంట్‌కు జనవరి 26 వ తేది (ఆదివారం) హైదరాబాద్ ఆస్పత్రికి వెళ్లారు. తిరిగి సోమవారం (జనవరి 27) రాత్రి వచ్చేసరికి తాళం వంకరగా.. పగులగొట్టినట్లు.. విరిగి ఉంది. ఆందోళనగా ఇంట్లోకి వెళ్లి చూడగా ఎలాంటి వస్తువలు గాని... డబ్బులు కాని పోలేదు.

అప్పుడు సీసీ కెమారలను పరిశీలించగా దొంగ తాళాన్ని పగులకొట్టేందుకు నానా తంటాలు పడినట్లు రికార్డ్ అయింది. ఎంత ప్రయత్నించినా తాళం రాకపోయేసరికి విసుగుతో వెళ్లిపోయాడు. ఈ విషయాన్ని ఇంటి యజమాని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దొంగలు పడిన ప్రాంతంలో పోలీసులు పెట్రోలింగ్ నిర్వహించాలని స్థానికులు కోరుతున్నారు.

## రాష్ట్రానికి అంతర్జాతీయ సంస్థలు

**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణ రాష్ట్రానికి పెట్టుబడుల రాకపై సీఎం రేవంత్ రెడ్డి సంతృప్తి వ్యక్తం చేశారు. తన దావోస్ పర్యటన గురించి సీఎం రేవంత్ రెడ్డి మంగళవారం మంత్రులతో కలిసి మీడియా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో సీఎం మాట్లాడుతూ.. పెట్టుబడుల సాధనలో కాంగ్రెస్ ప్రభుత్వం ఘన విజయం సాధించిదన్నారు. ప్రభుత్వం ఏర్పడ్డాక 14 నెలల్లో ప్రజల విశ్వాసాలను చూరగొన్నామని సీఎం అన్నారు, ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా తమకు అప్పగించిన భాద్యతను తాము నిర్వహిస్తున్నామన్నారు.దావోస్ పర్యటనలో ఎన్నడూ ఊహించని రీతిలో రూ. 1.80 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయన్నారు. ఎన్నో అంతర్జాతీయ సంస్థలు తమతో ఒప్పందం కోసం ముందుకు వచ్చాయని, రాష్ట్రంలోని యువతకు ఈ ఒప్పందాల ద్వార ఉపాధి దొరుకుతుందన్నారు. స్కిల్ డెవలప్మెంట్ కు సంబంధించి సింగపూర్ తో ప్రభుత్వం ఒప్పందం చేసుకుందని, మన విద్యార్థులు సింగపూర్ కు వెళ్లి శిక్షణ పొందే అవకాశం ఉంటుందన్నారు.తెలంగాణ ఆర్థిక స్థితిని దెబ్బకొట్టేందుకు ఎందరో ప్రయత్నిస్తున్నారని, కానీ సంస్థలు మన రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు అంగీకరించడం గర్వించదగ్గ విషయమన్నారు. హైదరాబాద్ కు పెట్టుబడులు రాకుండా చేయాలని కుట్రలు చేశారని, ఎన్నో అపోహలు, అనుమానాలు సృష్టించారన్నారు. పక్కా ప్రణాళికతో దావోస్ కు వెళ్లాం కనుకే అన్ని పెట్టుబడులు సాధించామని సీఎం అన్నారు. 13 నెలల్లో రూ.లక్షా 80వేల కోట్ల పెట్టుబడులు రాష్ట్రానికి వచ్చాయని సీఎం మరోమారు పునరుద్ఘాటించారు.తెలంగాణను వన్ ట్రిలియన్ ఎకానమీలో చేర్చడమే లక్ష్యంగా తమ ప్రభుత్వం ముందుకు సాగుతుందన్నారు. రాష్ట్రంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కిల్ యూనివర్శిటీ స్థాపనతో యువతకు నైపుణ్యతతో కూడిన విద్యను అందిస్తామన్నారు. ప్రస్తుతం పెట్టుబడుల రాకతో, తెలంగాణ నిరుద్యోగ యువతకు అవకాశాలు కల్పనతో పాటు ఉపాధి అవకాశాలు చేరువ అవుతాయన్నారు. గతం కంటే 4 రెట్లు ఎక్కువగా పెట్టుబడులు సాధించడం తనకు ప్రజలు ఇచ్చిన బృహత్తర అవకాశంగా భావిస్తున్నట్లు తెలిపారు.

ఈ సమావేశంలో మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవతో అంతర్జాతీయ సంస్థలు రాష్ట్రంలో అడుగులు పెడుతున్నాయన్నారు. రాజకీయంగా కొందరు తమను విభేదించినా, వాటిని తాము స్వీకరించి సలహాలుగా మార్చుకున్నామన్నారు. రాష్ట్రంలో తమ కాంగ్రెస్ ప్రభుత్వం ఓ వైపు ప్రజా సంక్షేమ పథకాలు సాగిస్తూ.. మరోవైపు అభివృద్ధి వైపు రాష్ట్రాన్ని ముందుకు నడిపిస్తున్నామని మంత్రి తెలిపారు. ఈ సమావేశంలో మంత్రులు సీతక్క, తుమ్మల నాగేశ్వరరావు, పలువురు ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

# గద్దర్‌కు ఏ హోదాలో అవార్డ్ ఇవ్వాలి? రేపు ఉగ్రవాదులకూ ఇవ్వమంటారా?: రేవంత్ రెడ్డిపై ఏపీ బీజేపీ నేత ఆగ్రహం




**హైదరాబాద్ పెన్ పవర్:**గద్దర్‌కు పద్మ అవార్డ్ ఇవ్వాలన్న తెలంగాణ కాంగ్రెస్ నేతల వ్యాఖ్యలపై ఆంధ్రప్రదేశ్ బీజేపీ ఉపాధ్యక్షుడు విష్ణువర్ధన్ రెడ్డి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. గద్దర్‌కు ఏ హోదాలో పద్మ అవార్డ్ ఇవ్వాలి? కాంగ్రెస్ వాళ్లు రేపు ఉగ్రవాదులకు కూడా అవార్డు ఇవ్వమంటారేమో? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజ్యాంగాన్ని విశ్వసించని వ్యక్తికి పద్మ అవార్డు ఎలా ఇస్తారని ప్రశ్నించారు.

ఈరోజు ఆయన మాట్లాడుతూ... బీజేపీ కార్యకర్తలు నిత్యం నమ్మిన సిద్ధాంతం కోసం ప్రజాస్వామ్యబద్ధంగా ఆందోళనలు చేస్తారని, కానీ గద్దర్ మాత్రం నక్సలైట్లతో కలిసి ఎంతోమందిని హత్య చేయించారని ఆరోపించారు. గద్దర్‌ను ఎల్‌టీటీఈ ప్రభాకరన్, నయీంతో పోల్చారు. ఎంతోమంది పోలీసులను చంపిన కేసులో... కోర్టులకు కూడా తిరగలేనని గద్దర్ రాష్ట్రపతికి లేఖ కూడా రాశారని గుర్తు చేశారు.గద్దర్ కూతురు వెన్నెల ఇప్పుడు కాంగ్రెస్ పార్టీలో ఉన్నారు కాబట్టి ఆయనకు పద్మ పురస్కారం ఇవ్వాలా? అని రేవంత్ రెడ్డిపై నిప్పులు చెరిగారు. రాజీవ్ గాంధీని హత్య చేసిన వారికి కూడా పద్మ పురస్కారం ఇవ్వమంటారా? అని ప్రశ్నించారు. గద్దర్‌కు ఎల్‌టీటీఈ తీవ్రవాదులకు తేడా ఏమిటో చెప్పాలన్నారు. మాజీ మావోయిస్ట్, రాజ్యాంగ వ్యతిరేకి అయిన గద్దర్‌కు ఏ హోదాలో అవార్డు ఇవ్వాలో తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి చెప్పాలన్నారు. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ నేతలు పద్మ అవార్డుల గురించి అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. పద్మ అవార్డుల ఎంపిక ప్రక్రియ గురించి తెలియని వాళ్లే రేవంత్ రెడ్డికి సలహా ఇస్తున్నట్లుగా ఉందన్నారు.

# మైనర్ ను గర్భవతిని చేసిన యువకుడు.. రూ. 5 లక్షలకు పెద్దమనుషుల సెటిల్మెంట్

**నల్గొండ జిల్లాలో అమానవీయ ఘటన**

**పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేసిన యువకుడు**

**కోర్టులో విచారణ జరుగుతుండగా పెద్ద మనుషులతో రాజీ యత్నం**

**హైదరాబాద్ పెన్ పవర్:**ప్రేమించానని, పెళ్లి చేసుకుంటానని మాయమాటలు చెప్పి ఓ మైనర్ ను గర్భవతిని చేశాడో యువకుడు.. తీరా వేరే అమ్మాయిని పెళ్లిచేసుకోవడంతో ఆ బాలిక పోలీసులను ఆశ్రయించింది. పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడిని కోర్టులో హాజరుపరిచారు. బాలికను మోసం చేసినట్లు నిర్ధారించే సాక్ష్యాలు బలంగా ఉండడంతో శిక్ష తప్పదని భావించిన యువకుడు కొత్త ఎత్తు వేశాడు. పెద్దమనుషుల ను రంగంలోకి దించి రూ.5 లక్షలతో కేసు నుంచి బయటపడే ప్రయత్నంచేశాడు. నల్గొండ జిల్లాలో జరిగిన ఈ అమానవీయ ఘటన వివరాలు.. జిల్లాలోని ఎరసానిగూడెం గ్రామానికి చెందిన ఓ బాలికను ఆరేళ్ల క్రితం చిప్పలపల్లి గ్రామానికి చెందిన వెంకన్న అనే యువకుడు ప్రేమించానని, పెళ్లిచేసుకుంటానని చెప్పి నమ్మించాడు. మాయమాటలతో మభ్యపెట్టి శారీరకంగా వాడుకున్నాడు. దీంతో బాలిక గర్భం దాల్చగా.. వెంకన్న మాత్రం వేరే పెళ్లి చేసుకున్నాడు. దీంతో పెళ్లి చేసుకుంటానని చెప్పి మోసం చేశాడంటూ వెంకన్నపై బాలిక కట్టంగూర్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు




చేసింది. ఈ క్రమంలో పోలీసులు సదరు యువకుడిపై కేసు నమోదు చేసి వెంకన్నను కోర్టులో హాజరుపరిచారు. డీఎన్ఏ పరీక్షల్లోనూ బాలిక గర్భానికి కారణం వెంకన్నేనని తేలింది. దీంతో ఈ కేసులో శిక్ష తప్పదని భావించిన వెంకన్న పెద్దమనుషులతో రాజీకి ప్రయత్నించాడు. పెద్ద మనుషులు బాలిక శీలానికి ఖరీదు కడుతూ.. రూ.5 లక్షలు ఇవ్వాలని తీర్మానించారు. ఇందులో రూ.3.50 లక్షలు పెద్ద మనుషుల పేరుమీద బ్యాంకులో జమ చేసి, మిగతా రూ.1.50 లక్షలు కేసు ముగిసిన వెంటనే ఇచ్చేలా వెంకన్న డీల్ కుదుర్చుకున్నట్లు తెలిసింది.

# శవపేటిక మీద కూడా భార్య టార్చర్ వల్లే చనిపోయాడని రాశారు..!




**హైదరాబాద్ పెన్ పవర్::** కర్ణాటకలోని హుబ్లీలో విషాదం జరిగింది. భార్య పెట్టిన చిత్రహింసలు భరించలేక ఆత్మహత్య చేసుకుని చనిపోతున్నట్లు సూసైడ్ లెటర్‌లో పేర్కొన్న పీటర్ గొల్లపల్లి అనే వ్యక్తి ఇంట్లోనే ఉరేసుకుని ప్రాణాలు తీసుకున్నాడు. తెలుగు కుటుంబానికి చెందిన పీటర్ గొల్లపల్లి కుటుంబంతో సహా హుబ్లీకి వెళ్లి స్థిరపడ్డాడు. హుబ్బళిలోని చాముండేశ్వరి నగర్‌లో పీటర్ గొల్లపల్లి నివాసం ఉంటున్నాడు. ప్రైవేట్ ఉద్యోగం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఫెబ్బే గొల్లపల్లి అలియాస్ పింకీతో రెండేళ్ల క్రితం పీటర్‌కు వివాహం జరిగింది. పెళ్లైన కొన్ని నెలలు ఈ జంట అన్యోన్యంగానే ఉంది. ఇటీవల కాలంలో పీటర్‌కు, పింకీకి మధ్య మనస్పర్థలు వచ్చాయి. ఈ గొడవలు తారా స్థాయికి చేరాయి. ఏడు నెలల క్రితం ఇద్దరూ విడిపోయారు. పింకీ భర్తను విడిచి పుట్టింటికి వెళ్లిపోయింది. విడాకులకు కూడా అప్లై చేసింది. భరణం కింద 20 లక్షలు ఇవ్వాలని పింకీ, ఆమె కుటుంబం పీటర్‌పై ఒత్తిడి పెంచారు. నిత్యం పీటర్‌కు కాల్స్ చేసి పింకీ, ఆమె కుటుంబం 20 లక్షలు డిమాండ్ చేస్తూ వేధించారు. ఆఫీస్‌లో ఉన్న సమయంలో కూడా తరచుగా కాల్స్ రావడంతో మేనేజ్‌మెంట్ పీటర్‌పై ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆఫీస్ మీటింగ్‌లో ఉండగా భార్యతో ఫోన్ కాల్‌లో పీటర్ గొడవపడటంతో మేనేజ్‌మెంట్ ఆగ్రహం కారణంగా ఉద్యోగం కూడా పోయింది. ఈ పరిణామాల కారణంగా పీటర్ డిప్రెషన్‌లోకి వెళ్లిపోయాడు. పెళ్లి చేసుకోకుండా ఉన్నా ప్రశాంతంగా ఉండేవాడినని పీటర్ తన కుటుంబ సభ్యులతో చెప్పి బాధపడిన సందర్భాలున్నాయని పీటర్ తండ్రి ఓబయ్య తెలిపాడు. భార్య టార్చర్ భరించలేక తీవ్ర మనస్తాపానికి గురైన పీటర్ చావే శరణ్యమని భావించి క్షణికావేశంలో ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆదివారం(జనవరి 26, 2025) మధ్యాహ్నం 12 గంటల సమయంలో ఆత్మహత్యకు పాల్పడ్డాడు.పీటర్ కుటుంబం ఆదివారం కావడంతో చర్చ్‌కు వెళ్లింది. మధ్యాహ్నం 12.30కు చర్చ్ నుంచి ఇంటికి తిరిగొచ్చేసరికి పీటర్ ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించాడు. పీటర్ ఉరేసుకున్న గదిలో సూసైడ్ లెటర్ లభ్యమైనట్లు పోలీసులు తెలిపారు. ఆ లేఖలో పీటర్ ఈ తొందరపాటు నిర్ణయం తీసుకున్నందుకు తన తండ్రిని క్షమాపణ కోరాడు. తన భార్యే తనను చంపేసిందని, తన చావును ఆమె కోరుకుందని.. తన భార్య పింకీ టార్చర్ కారణంగానే తాను చనిపోతున్నానని సూసైడ్ నోట్‌లో రాసి ఉంది. శవపేటిక మీద కూడా భార్య నరకం చూపించడం వల్లే పీటర్ చనిపోయాడని అతని కుటుంబ సభ్యులు రాయించారు.

# భార్యను క్రూరంగా చంపాడు.. ఇలాంటి కేసు ఎప్పుడు చూడలే: సీపీ సుధీర్ బాబు




**హైదరాబాద్ పెన్ పవర్:** హైదరాబాద్ లోని మీర్ పేట్లో భార్యను అత్యంత దారుణంగా హత్య చేసిన గురుమూర్తి కేసు వివరాలను రాచకొండ సీపీ సుధీర్ బాబు మంగళవారం (జనవరి 28) మీడియాకు వెల్లడించారు. ఈ సందర్భంగా సీపీ సుధీర్ బాబు మాట్లాడుతూ.. ఈ నెల 15, 16న భార్యాభర్తలు గురుమూర్తి, వెంకటమాధవి మధ్య గొడవ జరిగింది. ఈ క్రమంలో తీవ్ర ఆగ్రహానికి గురైన గురుమూర్తి 16వ తేదీన భార్య తలను గట్టిగా గోడకేసి కొట్టి హత్య చేశాడు. అనంతరం మాధవి మృతదేహాన్ని ముక్కలు ముక్కలుగా నరికి వాటర్ హీటర్ తో శరీర భాగాలను ఉడికించాడు.. ఆ ఉడికించిన బాడీ పార్ట్స్ ను స్టవ్‌పై కాల్చాడు. కాల్చిన ముక్కలను మళ్లీ పొడిగా మార్చి చెరువులో పడిబోశాడు.

భార్యను హత్య చేయాలని గురుమూర్తి ముందుగానే ప్లాన్ చేసుకున్నాడు. వ్యూహం ప్రకారం అత్యంత క్రూరంగా గురుమూర్తి తన భార్యను హత్య చేశాడు. ఇంత క్రూరంగా చంపుతారా అని మేమే ఆశ్చర్యపోయాం.. ఇలాంటి కేసు ఇప్పటి వరకు చూడలేదన్నారు సీపీ. నిందితుడిలో భార్యను చంపినట్లు ఎలాంటి పశ్చాత్తాపం లేదన్నారు. ఇంట్లో ఎలాంటి ఫిజికల్ ఎవిడెన్స్ లేకుండా గురుమూర్తి ప్లాన్ చేసుకున్నాడని తెలిపారు.

ఈ కేసుకు సంబంధించి సైంటిఫిక్ ఆధారాలు అన్ని సేకరించామని, గురుమూర్తి హత్యకు ఉపయోగించిన 16 ఆయుధాలను స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు. నిందితుడు గురుమూర్తిపై బీఎన్ఎస్ 103(1), 238, 85 సెక్షన్ల కింద కేసు నమోదు చేసి మంగళవారం అరెస్ట్ చేశామని తెలిపారు. నిందితుడు గురుమూర్తి గతంలో ఆర్మీలో పని చేశాడని చెప్పారు సీపీ. వెంకటమాధవి కేసును లోతుగా దర్యాప్తు చేస్తున్నామని.. విచారణలో కీలక విషయాలు వెలుగులోకి వస్తున్నాయని వెల్లడించారు.

# నల్లగొండలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రైతు మహాధర్నా

## కాంగ్రెస్ హయాంలో ఎక్కువైన రైతు కష్టాలు

**హైదరాబాద్ పెన్ పవర్:** నల్గొండ పట్టణంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన రైతు మహాధర్నా విజయవంతమైంది.

ఈ మహాధర్నాకు ముఖ్య అతిధిగా పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరై ప్రసంగించారుఏ. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రులు జగదీష్ రెడ్డి, నిరంజన్ రెడ్డి, ఎమ్మెల్సీలు మధుసూదనాచారి, కోటిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు, ఎంపీలు ఇతర బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

కేటీఆర్ కి ఘన స్వాగతం పలికి ర్యాలీగా క్లాక్ టవర్ వరకు రైతులు తీసుకెళ్లారు.కేటీఆర్ మాట్లాడుతూ నల్లగొండ పోరాటాల గడ్డ. పోరాటానికి స్ఫూర్తి ఇచ్చిన ఈ ప్రాంతానికి వందనం. కేసీఆర్ ఉన్నప్పుడు మాకు బ్రహ్మాండంగా వసతులుండేవి. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత రైతుల కష్టాలు ఎక్కువయ్యాయి. పోరాటాల పురిటి గడ్డ నల్లగొండ మళ్లీ రాష్ట్రంలో రైతుల తిరుగుబాటుకు వేదిక కావాలి. కేసీఆర్ పాలనలో టింగ్ టింగ్ మని డబ్బులు ఖాతాలో పడేవి. ఇప్పుడు రేవంత్ రెడ్డి రైతులను నిలువునా మోసం చేస్తున్నారని అన్నారు.

కేసీఆర్ 2 పంటలకే ఇస్తుండు.. కానీ రేవంత్రెడ్డి మూడో పంటకు ఇస్తా అని మోసం చేస్తున్నాడు. జనవరి 26న రాత్రి 12 గంటలకు డబ్బులు వేస్తామని అన్నడు రేవంత్ రెడ్డి.. కానీ ఇప్పటివరకు రూపాయి పడలేదు. రుణమాఫీ, రైతుబంధు, బోనస్ అన్నీ బోగస్ అని పేర్కొన్నారు. నల్లగొండ బిడ్డలు జీవశ్చవాలుగా మారడానికి కాంగ్రెస్సే కారణం. కాంగ్రెస్ ప్రభుత్వం 2023 యాసంగి పంటకు రైతు భరోసా 2,500 బాకీ పెట్టిందని, వానాకాలం ఒక్కో ఎకరానికి 7,500 బాకీ పడ్డది. ఒక్కో రైతుకు ఎకరాకు రూ.17,500 బాకీ ఉన్నది. కాంగ్రెస్ రైతులను నిలువునా మోసం చేసింది. రైతుబంధు డబ్బులు ఆపడానికి రేవంత్ రెడ్డి కుట్రలు పన్నుతున్నారు. మార్చి 31 వరకూ రుణమాఫీ కొనసాగుతుందని చెబుతున్నారు కానీ ఏ సంవత్సరమో చెప్పడం లేదు. నల్లగొండ నుంచి కాంగ్రెస్ వ్యతిరేక పోరాటం ప్రారంభం. కాంగ్రెసోళ్లు మళ్లీ ఓట్ల కోసం వస్తారు. నిలదీయండి. నల్లగొండ నుండే కాంగ్రెస్ను చీల్చి చెండాడాలి. హైకోర్టు ధర్నాకు అనుమతిచ్చినందుకు ధన్యవాదాలు. మా పోరాటం న్యాయంగా కొనసాగుతుంది. న్యాయం ఇంకా బ్రతికే ఉందని అన్నారు.

# మంత్రి కోమటిరెడ్డి కి కేటీఆర్ సవాల్




**హైదరాబాద్ పెన్ పవర్:** మంత్రి కోమటిరెడ్డి కి కేటీఆర్ సవాల్ నల్లగొండ జిల్లా అభివృద్ధిపై క్లాక్ టవర్ వద్దకు చర్చకు రావాలని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి మాజీ మంత్రి కేటీఆర్ సవాల్ విసిరారు. రైతుల సంక్షేమానికి సంబంధించి ప్రశ్నించాలంటే కాంగ్రెస్ నేతలను నిలదీయాలన్నారు. బిఆర్ఎస్ మహాధర్నాకు అనుమతి ఇచ్చినందుకు హైకోర్టుకు ధన్యవాదాలు తెలిపారు. పదేళ్లు బిఆర్ఎస్ రాష్ట్రాబివృద్ధి చేసిందని. ఇక భవిష్యత్తులో కూడా బీఆర్ఎస్ పార్టీనే రాష్ట్రాభివృద్ధికి దోహదపడుతుందని చెప్పారు.

# రోజుకు ఒక గుడ్డు తినాలా.. రెండు గుడ్లు తినాలా.. ఎన్ని తింటే ఆరోగ్యం..!

హైదరాబాద్ పెన్ పవర్:కొంతమంది బ్రేక్ ఫాస్ట్ లో ఉడికించో, ఆమ్లెట్ వేసుకునో గుడ్లు తింటారు. గుడ్డులో హై కొలెస్ట్రాల్ ఉంటుందని, అది ఆరోగ్యానికి మంచిది కాదని చాలామంది నమ్ముతారు. దీని గురించి తెలిసినవారు ట్రేలకు ట్రేలు తినకుండా రోజూ రెండు తింటారంతే! రోజుకు రెండు గుడ్లు తింటే చాలు.. ఈ హెల్త్ బెనిఫిట్స్ పొందినట్టే!



**మంచి కొలెస్ట్రాల్ పెరుగుతుంది**

ఒక గుడ్డులో 186 మిల్లీగ్రాముల కొలెస్ట్రాల్ ఉంటుంది. 70 శాతం మందిలో కొలెస్ట్రాల్ పెరగడానికి గుడ్డు కారణం కాదు. మిగిలిన 30 శాతం మందిని ..హైపర్ రెస్పాండర్స్.. అని పిలుస్తారు. వీళ్లు గుడ్డు తీసుకుంటే చెడు కొలెస్ట్రాల్ పెరుగుతుంది. అయితే గుడ్డు మంచి కొలెస్ట్రాల్ పెంచడంలోనూ తోడ్పడుతుంది. మంచి కొలెస్ట్రాల్ ఎక్కువగా ఉన్నవాళ్లకు గుండె జబ్బుల ముప్పు తక్కువ. రోజుకు రెండు గుడ్లు... ఆరు వారాలు తింటే మంచి కొలెస్ట్రాల్ పది శాతం పెరుగుతుందని స్టడీల్లో తేలింది.

**ఆరోగ్యకరమైన జుట్టు, చర్మం, గోళ్లు**

గుడ్డులో విటమిన్ బి, బి12, బి5, బయోటిన్, రైబోఫ్లేవిన్, థయమిన్, సెలీనియం ఉంటాయి. ఈ విటమిన్స్ శరీరానికి అందడం వల్ల ఆరోగ్యకరమైన జుట్టు, చర్మం, గోళ్లు సొంతం అవుతాయి. ఈ విటమిన్స్ కణాలకు పోషకాలు అందించడం వల్ల చర్మం ఆరోగ్యంగా ఉంటుంది.

**రోగ నిరోధక శక్తి పెరుగుతుంది**

ఒకేసారి రెండు గుడ్లు తీసుకోవడం వల్ల 59 శాతం సెలీనియం, 32 శాతం విటమిన్ ఏ, 14 శాతం ఐరన్ శరీరానికి అందుతుంది. ఈ పోషకాలు రోగ నిరోధక శక్తిని పెంచడంలో తోడ్పడతాయి. జలుబు, జ్వరాన్ని పోగొట్టడంలోనూ గుడ్డుది ముఖ్య పాత్ర అని పరిశోధకులు చెబుతున్నారు. గుడ్డులో ఉండే లుటేన్, జెక్సాంతిన్ అనే రెండు యాంటీ ఆక్సిడెంట్స్ కన్నులో ఉండే మాక్యులర్ రిజియన్ లో కనుగొన్నారు. లుటేన్, జెక్సాంతిన్, ఒమెగా-3 కన్ను ఆరోగ్యంగా ఉండేందుకు తోడ్పడతాయని స్టడీల్లో తేలింది. ఈ రెండు యాంటీ ఆక్సిడెంట్స్ కంటిలో మెయింటైన్ చేస్తే రెటీనా... క్షీణించిపోకుండా కాపాడుతాయి.

**జ్ఞాపకశక్తి పెరుగుతుంది**

గుడ్డులో ఉండే కోలిన్ అనే పదార్థం మెదడు పని తీరుని మెరుగుపరుస్తుంది. జ్ఞాపకశక్తిని పెంచుతుంది. ఇతర ఆహారాల్లో కోలిన్ కనిపెట్టడం చాలా కష్టమనే చెప్పాలి. ఇక, గర్భిణులు గుడ్డు తింటే ఎంత మంచిదో తెలిసిందే. కార్నెల్ యూనివర్సిటీ శాస్త్రవేత్తలు చేసిన స్టడీలో.... రోజూ ఒక గుడ్డు తీసుకోవడం వల్ల లభించే కోలిన్స్... పుట్టబోయే బిడ్డ మెదడు ఆరోగ్యంగా ఉండేందుకు సాయపడుతుంది తేలింది.

**డి- విటమిన్ అందిస్తుంది**

మన దేశంలో ఎక్కువ మంది డి విటమిన్ లోపంతో బాధపడుతున్నారు. గుడ్డు తీసుకోవడం వల్ల డి - విటమిన్ వల్ల ఎముకలకు క్యాల్షియం పీల్చుకునే శక్తి పెరుగుతుంది. దీంతో ఎముకలు, పళ్లు ఆరోగ్యంగా ఉంటాయి.

# కుంభమేళా 2025: మౌని అమావాస్య ( జనవరి 29) న పుణ్య స్నానం ఎందుకు చేయాలి.. పురాణాల్లో ఏముంది..



హైదరాబాద్ పెన్ పవర్:ఉత్తరప్రదేశ్ ప్రయాగ్ రాజ్ లో కుంభమేళా జరుగుతుంది. జనవరి 29 మౌని అమావాస్య పుణ్య తిథి. మౌని అమావాస్య నాడు పుణ్య నదుల్లో స్నానం చేసి దానం చేయడం వల్ల పుణ్య ఫలితాలు లభిస్తాయి. ఆ రోజు ప్రత్యేకత ఏంటి? ఎందుకు పుణ్య స్నానాలు చేయాలి?.. పురాణాల్లో ఏముంది.. పండితులు ఏం చెబుతున్నారు.. మౌని అమావాస్య రోజున గంగానది స్నానం చేయడం ఎందుకు అంత ముఖ్యమైనది.. దీని వెనుక ఉన్న కథ ఏమిటో తెలుసుకుందాం. . .

మౌని అమావాస్య రోజున జరిగే మహా కుంభమేళా అమృత స్నానం సందర్భంగా ప్రయాగ్‌రాజ్‌లో భక్తులు ఇబ్బంది పడకుండా స్నానమాచరించేందుకు ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుంది. మౌని అమావాస్య రోజున కుంభమేళా సందర్భంగా ప్రయాగ్‌రాజ్‌లో జనసమూహం , ట్రాఫిక్‌ను సమర్థవంతంగా నిర్వహించడానికి సమగ్ర చర్యలు తీసుకుంటున్నట్లు ప్రభుత్వం తెలిపింది.

హిందూ మతంలో పితృ దేవతలను స్మరించుకుని.. వారికి తర్పణాలు ఇచ్చేందుకు చాలా పవిత్రంగా భావిస్తారు. పుణ్య నదుల్లో కాని .. కుంభమేళా జరిగే ప్రదేశంలో కాని.. గయ లో కాని పిండ ప్రదానం చేస్తే ఉత్తమ లోకాలకు చేరుకుంటారని పురాణాలు చెబుతున్నాయి. ప్రస్తుతం కుభమేళా ప్రయాగ్ రాజ్ లో జరుగుతుంది. ఆరోజున (జనవరి 29) దాదాపు 10 కోట్ల మంది భక్తులు పుణ్య స్నానం ఆచరించేందుకు ప్రయాగ్ రాజ్ కు వస్తారని ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం అంచనా వేస్తుంది. ఈ రోజున పుణ్యనదుల్లో చేసే స్నానాన్ని అమృత స్నానం అంటారు.

**మౌని అమావాస్య ఎప్పుడు?**

ఈ సంవత్సరం (2025) మౌని అమావాస్య తేదీ జనవరి 28న సాయంత్రం 7:35 గంటలకు ప్రారంభమవుతుంది. ఈ తేదీ మరుసటి రోజు అంటే జనవరి 29 సాయంత్రం 6:05 గంటలకు ముగుస్తుంది. జనవరి 29న మౌని అమావాస్య జరుపుకుంటారు. ఈ రోజున మౌని అమావాస్య ఉపవాసం కూడా పాటిస్తారు. మహా కుంభంమేళాలో అమృత స్నానం కూడా చేస్తారు.

**మౌని అమావాస్య ..గంగానది స్నానం ప్రాముఖ్యత**

మౌని అమావాస్య రోజున ( జనవరి 29) పితృదేవతలకు నైవేద్యాలు, పిండ ప్రదానం.. దానాలు కూడా చేస్తారు. ఆ రోజున గంగా స్నానం చేయడం చాలా ప్రాముఖ్యత కలిగి ఉంది. పెద్దలు ఉత్తమలోకాలకు చేరుకోకుండా మధ్యలోనే ఉంటే.. ఆరోజు ( జనవరి 29) వారి పేరున నీళ్లు.. నువ్వులను.. తర్పణాలు వదిలితే ఉత్తమలోకాలకు చేరుకుంటారని పండితులు చెబుతున్నారు. మౌని అమావాస్య రోజున సూర్యోదయానికి ముందు గంగానదిలో స్నానం చేసే సంప్రదాయం ఉంది. మౌని అమావాస్య నాడు గంగానదిలో స్నానం చేయడం అమృతంలో స్నానం చేయడంతో సమానమని భావిస్తారు. మౌని అమావాస్య నాడు గంగానదిలో స్నానం చేసేవారికి అమృతంలో స్నానం చేసినంత ప్రయోజనాలు లభిస్తాయని నమ్ముతారు.హిందూ మతంలో గంగానదిలో స్నానం చేయడం చాలా పవిత్రంగా భావిస్తారు. గంగానదిలో స్నానం చేయడం ద్వారా ఒక వ్యక్తి చేసే పాపాలు తొలగిపోతాయి. పురాణాల ప్రకారం, గంగానదిలో స్నానం చేయడం పవిత్రత సముద్ర మథనానికి సంబంధించినదని చెబుతారు. సముద్ర మథనం సమయంలో అమృతపు కుండ ఉద్భవించింది. దీని గురించి దేవతలకు, రాక్షసులకు మధ్య అమృత కలశం విషయంలో గొడవ జరిగింది. ఈ సమయంలో కలశం నుండి కొన్ని నీటి చుక్కలు ప్రయాగ్‌రాజ్, హరిద్వార్, ఉజ్జయిని, నాసిక్‌లలో పడ్డాయి. ఈ ప్రదేశాలలో ప్రవహించే నదుల నీరు అమృతం పడటం వల్ల స్వచ్ఛం గా మారింది. అందుకే పండుగలు, పౌర్ణమి, అమావాస్య వంటి తిథి దినాలలో గంగా స్నానం చేస్తారు.

**మౌని అమావాస్య కథ**

గరుడ పురాణం ప్రకారం..ఇది పురాతన కాలం నాటి విషయమని గరుడపురాణం ద్వారా . కాంచీపురం అనే నగరంలో దేవస్వామి అనే బ్రాహ్మణుడు తన కుటుంబంతో నివసిస్తున్నాడు. అతని భార్య చాలా ధార్మికురాలు... పతివ్రత.. గుణవంతురాలు. దేవస్వామి బ్రాహ్మణ దంపతులకు 7 కుమారులు ఒక కుమార్తె ఉన్నారు. దేవస్వామి తన కుమార్తె వివాహం కోసం జ్యోతిష్యుడిని సంప్రదించినప్పుడు, జ్యోతిష్కుడు ఆ బ్రాహ్మణుని జాతకంలో గ్రహాల స్థితిని చూసి విచారకరమైన వార్త చెప్పాడు. నీకు అల్లుడుగా నీచుడు.. దుర్మార్గుడు.. తల్లి దండ్రులను పట్టించుకోని వాడు.. భార్యను .. అత్తమామలను ఇబ్బంది పెట్టేవాడు వస్తాడని చెబుతాడు. అంతేకాదు పెళ్లి అయిన అనతి కాలంలోనే నీకుమార్తె వితంతువు అవుతుందని చెబుతాడు. విధి అలా ఉంది. దానిని ఎవరూ తప్పించలేరు కదా..అని జ్యోతిష్కులు చెబుతారు.

ఏది జరగాలో శివుడి ఆ జ్ఞ మేరకు బ్రహ్మ సృష్టిస్తాడని పురాణాలు చెబుతున్నాయి. కాలం గడిచిన తరువాత దేవస్వామి కుమార్తెకు వివాహ వయస్సు రావడంతో ... ఓ బ్రాహ్మణునకు నరసింహుడు అనే వ్యక్తికి ఇచ్చి పెళ్లి చేస్తారు. నరసింహుడు చాలా దుష్టుడు.. చెడ్డవాడు అని తెలిసినా..అతని తల్లి దండ్రులు,, దాచిపెట్టి.. వివాహం అయిన తరువాత అయినా మారుతాడేమోనని.. గుణవంతురాలు.. వినయశీలి అయిన దేవస్వామి కుమార్తెను కోడలిగా తెచ్చుకున్నారు.

పెళ్లి అయిన తరువాత నరసింహుడు చెడు అలవాట్ల వలన మద్యం సేవిస్తూ.. మాంసం తినుచూ.. భార్యను కూడా తినమని బలవంతం పెట్టేవాడు. నిత్యం నరసింహుడు తన భార్యను చిత్రహింసలు పెట్టేవాడు. ఇలా ఉండగా నరసింహుడి ఆగడాలను భరించలేక ... అతని తండ్రి చంపాడు. ఇలా ఆయన చేసిన పాపాల వలన ఇటు స్వర్గానికి.. అటు నరకానికి వెళ్లలేక మధ్యలో ఊగిసలాడుతున్నాడు. ఆ సమయంలో నరసింహుడి బాధ వర్ణనాతీతం. ఇలా ఉండగా గంగా నదిలో నరసింహుడి తండ్రి పిండప్రదానం చేశాడు. అది కూడా మౌని అమావాస్య రోజున చేయడంతో నరసింహుడు ఉత్తమలోకాలకు చేరుకున్నాడు.

కుంభమేళాలో స్నానం అతి ముఖ్యమైన ఆచారం. అయితే, మకర సంక్రాంతి నుండి ప్రారంభించి ప్రతిరోజూ సంగమంలో స్నానం చేయడం పవిత్రంగా భావిస్తారు. కొన్ని ప్రత్యేకమైన పవిత్ర స్నాన తేదీలు ఉన్నాయి. వీటిని 'అమృత స్నానం' అని పిలుస్తారు. జనవరి 29న జరిగే మౌని అమావాస్య మహా కుంభమేళాలో మూడవ పవిత్రమైన తేదీ అవుతుంది. మౌని అమావాస్య కాకుండా వచ్చే నెల( ఫిబ్రవరి 2025)లో మరో మూడు రోజులు ఉంటాయి..ఈ మూడు రోజులు ఫిబ్రవరి 3, అంటే బసంత్ పంచమి రోజు సోమవారం, ఫిబ్రవరి 12, అంటే మాఘ పూర్ణిమ.. ఫిబ్రవరి 26, అనగా మహా శివరాత్రి రోజున అమృత స్నానాలు ఆచరిస్తారు.